

భక్తిమార్గంలో యువత

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా తండాల్లో భక్తిభావం పెరుగుతోంది. యువత సేవాలాల్ దీక్ష స్వీకరించి నియమనిష్టలతో నిత్యం పూజలు చేస్తున్నారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్
ఆది : 6:33

సహర్
సోమ : 4:42

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
39.0 /25.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం కొన్నిచోట్ల పాక్షికంగా, మరికొన్ని చోట్ల పూర్తిగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడా చిన్నపాటి వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

గ్రంథాలయంలో వసతులు కల్పించాలి



అభ్యర్థులతో మాట్లాడుతున్న దీపక్‌తివారి

ఆసిఫాబాద్: పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ అభ్యర్థులకు అవసరమయ్యే పుస్తకాలు, పత్రికలు, స్టడీ మెటీరియల్ గ్రంథాలయంలో అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు పలు సమస్యలు అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఇన్వర్టర్ సమకూర్చాలని తెలిపారు. వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా గ్రంథాలయంలో ఏసీ ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయన వెంట డీఆర్డీవో సురేందర్, లైబ్రేరియన్ సదానందం, సిబ్బంది ఉన్నారు.

ఈఎంటీలపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్: రోగులతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అంబులెన్స్ విధులు నిర్వహిస్తున్న ఈఎంటీలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గుడిసెల కార్తిక్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రోగులు అత్యవసర పరిస్థితుల్లో 108కు ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి ఈఎంటీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నూతన నియామకం



రజాక్‌కు స్వీటు తినిపిస్తున్న అభిమానులు

కెరమెరి: మే13 తేదీన జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ మైనార్టీ సెల్ ఇన్‌చార్జిగా కెరమెరి మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ రజాక్‌ను నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ జాతీయ మైనార్టీ సెల్ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్ గడి, తెలంగాణ చైర్మన్ ఫర్హాన్ అజ్మి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.500 బోనస్ ప్రకటించాలి



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

ఆసిఫాబాద్: వరి సాగు చేసిన రైతులకు ప్రభుత్వం రూ.500 బోనస్ వెంటనే ప్రకటించాలని బీసీ సంఘ నాయకులు అవుడపు ప్రణయ్, పిప్రి సాయి, ప్రశాంత్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల హామీలో వరి రైతులకు మద్దతు ధర కేటాయించి, క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే హామీ అమలు చేయాలని కోరారు. మరో 20 రోజుల్లో వరి ధాన్యం చేతికి వచ్చే సమయంలో రైతులు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

ఆలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కౌటాల: మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయి బాబా ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో అభిషేకం నిర్వహించి స్థానిక మార్కెట్ ఏరియా నుంచి సాయిబాబా ఆలయం వరకు పల్లకి ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి రమాదేవి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు మహా ప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య, కల్యాణి, ఆలయ పూజారి చంద్రశేఖర్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు రాములు, లహాను, శైలేష్, వినాయక్‌గౌడ్, రవి తదితరులున్నారు.

72 కేసులు.. రూ.90లక్షలు



వెంకట్రావ్‌పేట్-పోడ్సా చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న నగదుతో కాగజ్‌నగర్ డీఎస్పీ, సీఐ, ఎస్సైలు (ఫైల్)

- ఎంపీ ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు
- ఆధారాలు లేకుండా నగదు తరలింపు
- చెక్‌పోస్టుల వద్ద పోలీసుల పట్టివేత
- పరిమితి దాటి తీసుకెళ్లొద్దని సూచన
- జిల్లాలో రూ.90లక్షల నగదు స్వాధీనం



సిర్పూర్(టి)-మాకిడి అంతర్రాష్ట్ర రహదారి చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న నగదు, సామగ్రితో ఎస్సై (ఫైల్)

సిర్పూర్(టి): రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వీటి వద్ద నిత్యం విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదు, సామగ్రి స్వాధీనం చేసుకుంటున్నారు. జిల్లాలోని ప్రధాన రహదారులైన కాగజ్‌నగర్-మంచిర్యాల, కాగజ్‌నగర్-ఆసిఫాబాద్, కాగజ్‌నగర్-సిర్పూర్(టి), సిర్పూర్(టి)-కౌటాల, బెజ్జూర్ రహదారులతో పాటు మహారాష్ట్రకు వెళ్లే సిర్పూర్(టి)-మాకిడి, వెంకట్రావ్‌పేట్-పోడ్సా, గూడెం-అహెరి అంతర్రాష్ట్ర రహదారులు, ఆసిఫాబాద్-చంద్రపూర్ నేషనల్ హైవేపై పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు.

సరిహద్దు మండలాల్లో అప్రమత్తం

జిల్లాలోని అత్యధిక మండలాలు మహారాష్ట్రలోని చంద్రపూర్, గడ్చిరోలి జిల్లాలకు ఆనుకుని ఉన్నాయి. సిర్పూర్(టి) నియోజకవర్గంలోని సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని వాంకిడి, కెరమెరి, జైనూర్ మండలాలు మహారాష్ట్ర సరిహద్దులో ఉంటాయి. నిత్యం ఆయా మండలాల నుంచి మహారాష్ట్ర గ్రామాలకు రాకపోకలు కొనసాగుతుంటాయి. నిత్యం జిల్లా ప్రజలతో పాటు సుదూర ప్రాంతాల ప్రజలు జిల్లా మీదుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా జిల్లా నుంచి మహారాష్ట్రకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారులు, నేషనల్ హైవేలపై పోలీసులు మార్చి 16వ తేదీ నుంచి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. అంతర్రాష్ట్ర రహదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిత్యం వాహనాలను పూర్తిగా పరిశీలించి ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదు, సామగ్రిని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలిస్తున్నారు. అలాగే జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలనూ ఎస్పీ సురేశ్‌బాబు, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యమని వారు చెబుతున్నారు.

అంతర్రాష్ట్ర రహదారుల్లో ఎత్తివేత

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నుంచి జిల్లాలోని అంతర్రాష్ట్ర రహదారులతో పాటు ఇతర మండలాల్లోని ప్రధాన రహదారుల్లో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అయితే ఈనెల 4వ నుంచి సిర్పూర్(టి)-మాకిడి, వెంకట్రావ్‌పేట్-పోడ్సా అంతర్రాష్ట్ర రహదారుల్లోని చెక్‌పోస్టులు, చింతలమానెపల్లి మండలంలోని గూడెం-అహెరీ అంతర్రాష్ట్ర రహదారిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు ఎత్తివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఎత్తివేశామని, మళ్లీ వారి నుంచి ఆదేశాలు రాగానే ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

ఇప్పటివరకు పట్టుబడ్డ నగదు

జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీల్లో సుమారు 72 కేసులు నమోదు కాగా, రూ.90 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఒక్క సిర్పూర్(టి) మండలంలోనే ఇప్పటివరకు 13 కేసులు నమోదు కాగా, రూ.22లక్షల నగదు, రూ.1.70 లక్షల విలువైన సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఇలా స్వాధీనం చేసుకున్న నగదు, సామగ్రిని కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌కు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు. సంబంధిత వ్యక్తులు సరైన ఆధారపత్రాలు గ్రీవెన్స్ కమిటీకి అందించి నగదు, సామగ్రి తీసుకోవాలని సూచిస్తున్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు చర్యలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీఈవో అశోక్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 685 ప్రభుత్వ పాఠశాలలున్నాయని తెలిపారు. వేసవి సెలవులు ముగిసి వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోపు ప్రభుత్వ పాఠశాల కమిటీలు బాధ్యతగా తీసుకుని అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో పెండింగ్ పనులు గ్రామ సమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే యూనిఫాంలు అందించేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, నాయకులు, కార్యకర్తలు

ఆసిఫాబాద్‌అర్బన్: పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల పరిహారాన్ని అందించి ఆదుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో సుమారు 200 మంది రైతులు చనిపోయారని తెలిపారు. బాధిత కుటుంబాలను ఒక్క మంత్రి కూడా పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ నాయకులు రాజకీయాలు, చిల్లర మాటలు మాని రైతులకు అండగా నిలవాలని హితవుపలికారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం పంట రుణాలు మాఫీ చేయాలని, ఎకరాకు రైతుబంధు రూ.15వేలు, వడ్లు, మక్కలకు రూ.500 బోనస్, రైతు కూలీలకు రూ.12వేలు, కౌలు రైతుకు రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని తెలిపారు. కేసీఆర్ హయాంలో పంటలు పండడమే గాని ఎండిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. రైతులకు మేలు జరిగేదాకా బీఆర్ఎస్ పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావు, మహిళా నాయకురాలు సరస్వతి, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికలాధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. ఎన్నికల నిర్వహణపై ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి 8వ తేదీ వరకు 4,55,437 మంది ఓటర్లున్నారని, వీరికి 676 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో 597 కేంద్రాలు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం వాటి సంఖ్య 676కు పెరిగిందని పేర్కొన్నారు. ఇందులో 47 సమస్యాత్మక, 22 మావోయిస్టు ప్రభావిత, 56 నెట్‌వర్క్ లేని పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. గత అనుభవాల దృష్ట్యా పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఫారం–12 ద్వారా దరఖాస్తు స్వీకరించనున్నట్లు తెలిపారు. సదరు ఉద్యోగి జిల్లాలో లేదా వారి సొంత నియోజకవర్గంలో ఓటు వేసే వెసులుబాటు ఉందని, ఇందుకు ముందుగానే సమాచారం ఇవ్వాలని సూచించారు. పోస్టల్ ఉద్యోగులు మే 3నుంచి 8వ తేదీలోపు ఓటు వేయవచ్చని పేర్కొన్నారు. ఎన్నికల రోజు ప్రత్యేక సాధారణ సెలవు వర్తిస్తుందని తెలిపారు. ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, 1950 లేదా 08733-79033 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఫారం–12 ద్వారా దివ్యాంగులు, వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేయవచ్చని తెలిపారు. ఎస్పీ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు రూ.90,62,630 నగదు, రూ.3,94,802 విలువైన 787 లీటర్ల లిక్కర్, 1.05 కిలోల గంజాయి, 17 గ్రైండర్లు, 43 ఎయిర్‌కూలర్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

వేసవిలో ఎండలు ముదురుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. అవసరమైతేనే పగటివేళ ఇంటి నుంచి బయటకు రావాలని, సాధ్యమైనంత ఎక్కువ నీటిని తీసుకోవాలని సూచించారు. తాగునీటి ఇబ్బంది లేకుండా అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. మిషన్ భగీరథ నీరు చివరి ఇంటివరకు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పరిష్కారం కోసం అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఉపాధిహామీ పని ప్రదేశాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, నీడ కోసం టెంట్లు వేయాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్చిచ్చు.. ముప్పు హెచ్చు





శాటిలైట్‌తో సెల్‌ఫోన్‌కు వచ్చిన సమాచారం

- వేసవిలో అడవిలో వ్యాపిస్తున్న మంటలు
- వన్యప్రాణులకు పొంచి ఉన్న ప్రమాదం
- నివారణకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు
- ఫైర్‌లైన్స్ ఏర్పాటు, బృందాలతో నిఘా

పెంచికల్‌పేట్: మానవ తప్పిదాలు, నిర్లక్ష్యంతో అభయారణ్యాలు అగ్నికి ఆహుతవుతున్నాయి. వేసవిలో అడవుల్లో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో విలువైన కలప దగ్ధమవుతోంది. వన్యప్రాణులకూ ప్రమాదం పొంచి ఉంది. ఈనేపథ్యంలో అడవిలో నిప్పు రాజుకోకుండా ఉండేందుకు అటవీశాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. మంటలు చెలరేగకుండా జాగ్రత్తలు పాటిస్తున్నారు. అటవీ గ్రామాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

6,04,172 ఎకరాల్లో అడవి..

జిల్లా వ్యాప్తంగా 6,04,172 ఎకరాల్లో అటవీ విస్తీర్ణం ఉంది. వీటిలో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డివిజన్ల పరిధిలో 11 రేంజ్‌లు, 79 సెక్షన్లు, 245 బీట్లు, 846 కంపార్టుమెంట్లు ఉన్నాయి. ఆయా రేంజ్‌ల పరిధిలో అనేక రకాల వృక్షాలతో పాటు వన్యప్రాణులు ఆవాసంగా ఏర్పాటు చేసుకుని మనుగడ సాగిస్తున్నాయి. అడవుల్లో జరిగే అగ్ని ప్రమాదాలతో జీవుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

ఇదీ.. కార్చిచ్చుకు కారణం

ప్రస్తుతం ఆకురాల్చే కాలం కావడంతో అడవుల్లో కార్చిచ్చు పెరుగుతోంది. పశువుల కాపరులు, చీపురు గడ్డి, ఎండుకట్టెల కోసం వెళ్లేవారు, కలప స్మగ్లర్లు అగ్గిపెట్టెలతో వెళ్తుంటారు. వారు సిగరెట్లు, బీడీలు తాగాక పీకలను ఆర్పివేయకుండానే అటవీప్రాంతంలో వేయడంతో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరో వైపు పెద్దమొత్తంలో తునికాకు సేకరణకు కొత్త ఆకు వచ్చేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా అడవులకు నిప్పు పెడుతున్నారు. దీంతో అటవీశాఖ అధికారులు అటవీ ప్రాంతాల్లో ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించడంతో పాటు అనుమతులు లేకుండా అడవిలోకి ప్రవేశిస్తే కేసులు నమోదు చేస్తామని గ్రామాల్లో నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో హెచ్చరిస్తున్నారు.

వన్యప్రాణులకు ముప్పే..

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి), కాగజ్‌నగర్, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాం మండలాల పరిధిలో సహజ నీటి వనరులతో పాటు పెద్దవాగు, ప్రాణహిత నది ప్రవహిస్తోంది. దీంతో ఎక్కువగా వన్యప్రాణులు ఇక్కడ మనుగడ సాగిస్తున్నాయి. వేసవిలో రగులుతున్న కార్చిచ్చుతో అడవులు కాలిపోతుండటంతో వన్యప్రాణుల మనుగడకు ముప్పు పొంచి ఉంది.

శాటిలైట్ ద్వారా తక్షణ సమాచారం

లక్షల ఎకరాల్లో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే వెంటనే సమాచారం అందించేందుకు అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో ఫైర్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. శాటిలైట్ ద్వారా వచ్చే సమాచారం కంట్రోల్ రూం నుంచి నేరుగా ఆయా రేంజ్‌ల పరిధిలోని అధికారులకు చేరుతుంది. దీంతో వారు ప్రమాదాలను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. శాటిలైట్ సేవలు వినియోగిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. అటవీ ప్రాంతంలో ఎక్కడ ప్రమాదాలు జరిగినా వెంటనే ఆయా రేంజ్‌ల పరిధిలోని రెస్క్యూ టీంలు అక్కడికి చేరుకుని ఫైర్ బ్లోయర్‌లతో కార్చిచ్చును ఆర్పివేస్తున్నాయి.

నిప్పు రగలకుండా చర్యలు

అడవిలో నిప్పు రగలకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. అటవీ ప్రాంతంలో ఫైర్‌లైన్‌లు ఏర్పాటు చేశాం. అటవీ సమీపంలోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అడవిలో నిప్పుతో కలిగే నష్టాలను వివరిస్తూ గ్రామాల్లో వాల్‌పోస్టర్లు వేస్తున్నాం. కరపత్రాలు పంచుతున్నాం. అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. అడవిలో నిప్పు రగలకుండా సహకరించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది. ఉద్దేశపూర్వకంగా అడవులకు నిప్పు పెడితే వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేస్తాం.

– జీ సుధాకర్, ఎఫ్ఆర్వో, పెంచికల్‌పేట్

నీటి సరఫరాపై జిల్లా కేంద్రంలో సర్వే



పట్టణంలో సర్వే చేస్తున్న మున్సిపల్ అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: వేసవి నేపథ్యంలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరాకు సంబంధించి మున్సిపల్ అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం పట్టణంలోని పలు కాలనీల్లో ఒక ఇంటిని యూనిట్‌గా తీసుకుని నీటి సరఫరాకు సంబంధించిన ప్రశ్నావళిని తయారు చేసి ప్రజల నుంచి సమాచారం సేకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతీ ఇంటిలో నీటి వినియోగం, సరఫరాపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికి మిషన్ భగీరథ లేదా మున్సిపాలిటీ, బోర్‌వెల్ ద్వారా నీటి సౌకర్యాలపై సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో భాగంగానే సర్వే చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధికారులు కుమారస్వామి, రమేశ్, శంకర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగ



కౌటాల: జిల్లాలో రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. జిల్లాలో శనివారం ఎండలు మండిపోయాయి. వేడి గాలులు వీస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున వడ దెబ్బ తగిలే ప్రమాదముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు. శనివారం జిల్లాలోని కెరమెరిలో పగటి ఉష్ణోగ్రత 43.3 డిగ్రీలుగా నమోదైంది. ఎండలు మండుతుండడంతో జిల్లాలోని 13 మండలాలు అలర్ట్ జోన్‌లో ఉన్నాయి.

శనివారం నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
దనోరా	43.3	26.1
తిర్యాణి	43.1	24.4
కుంచవెల్లి	43.1	26.4
ఎల్కపల్లి	43.0	26.1
జంబుగా	43.0	24.5
కౌటాల	42.9	28.5
సిర్పూర్(టి)	42.8	25.2
వాంకిడి	42.8	24.1
వంకులం	42.7	26.3
ఆసిఫాబాద్	42.5	24.9
రెబ్బెన	42.1	25.7

సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న టొబ్రేవాల్

కాగజ్‌నగర్ రూరల్: ప్రాణహిత నది సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ టొబ్రేవాల్ సూచించారు. శనివారం పట్టణంలోని అటవీశాఖ డివిజన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ నుంచి మహారాష్ట్ర మీదుగా ప్రాణహిత నది దాటి మన ప్రాంతానికి ప్రవేశించిన ఏనుగు తిరిగి మహారాష్ట్ర ప్రాంతానికి వెళ్లిందని తెలిపారు. అయినప్పటికీ ప్రాణహిత నది పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మన జిల్లాలోకి ఏనుగు ప్రవేశించడం ఇదే మొదటిసారి అని తెలిపారు. ఏనుగు బీభత్సంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. గతంలో ఛత్తీస్‌గఢ్ నుంచి ఏనుగులు మహారాష్ట్ర అటవీ ప్రాంతానికి వచ్చి అటు నుంచి తిరిగి ఛత్తీస్‌గఢ్ ప్రాంతాకే వెళ్లిపోయాయని తెలిపారు. ఏనుగు మహారాష్ట్రలోకి ప్రవేశించినట్లు అక్కడి అటవీశాఖ అధికారులు ధృవీకరించారని పేర్కొన్నారు. ఏనుగు మన ప్రాంతానికి వచ్చిన సమయంలో అటవీశాఖ సిబ్బందితో పాటు రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది పూర్తిగా సహకరించారని వివరించారు.

సిబ్బందికి శిక్షణ

ఏనుగు తిరిగి రాబోయే రోజుల్లో మన ప్రాంతానికి వస్తే కదలికలను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు శనివారం సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గడ్చిరోలి జిల్లాకు చెందిన అటవీశాఖ అధికారులతో శిక్షణ ఇప్పించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

రెబ్బెన: గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ గంగాపూర్ సెక్టార్ సూపర్‌వైజర్ విజయ సూచించారు. శనివారం గంగాపూర్‌లో బాల్య వివాహాల నిషేధంపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణీత వయస్సు వచ్చేదాకా వివాహాలు జరిపించవద్దన్నారు. ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేస్తూ ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆడపిల్లలకు నిర్ణీత వయస్సు రాక ముందే బాల్య వివాహాలు చేస్తే ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐదు ఎడ్లు చోరీ

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని షేక్ అహ్మద్‌గూడ కాలనీకి చెందిన ముగ్గురు రైతుల ఐదు వ్యవసాయ ఎడ్లు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. షేక్ అహ్మద్ గూడ కాలనీకి చెందిన బోర్కుటే మోహన్ అనే రైతుకు చెందిన రెండు ఎడ్లు, బోర్కుటే ప్రకాష్‌కు చెందిన రెండు ఎడ్లు, దంద్రె పోశంకు చెందిన ఒక ఎద్దు మంగళవారం మేతకు వెళ్లి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల గ్రామాల్లో గాలించినా దొరకలేదు. దీంతో రైతులకు చెందిన 5 ఎడ్లను మేతకు వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పశువులను దొంగలించినట్లు గ్రామస్తులు భావిస్తున్నారు.

త్వరలో మ్యాన్‌రైడింగ్..!



పనులు పరిశీలిస్తున్న అధికారులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిలో మ్యాన్‌రైడింగ్ పనులు పూర్తి కాగా ట్రయల్ దశలో ఉండడంతో పాటు మరో వారం రోజుల్లో మ్యాన్‌రైడింగ్ ప్రారంభం కానుండడంతో గని కార్మికుల కష్టాలు తీరనున్నాయి. గని 17వ లెవల్ వరకు పని స్థలాలు ఉండడంతో ఇప్పటి వరకు కార్మికులు కాలినడకన వెళ్తున్నారు. కార్మికుల సమస్య పరిష్కరించడంతో పాటు ఉత్పత్తిని మెరుగుపర్చేందుకు యాజమాన్యం మ్యాన్ రైడింగ్ ఏర్పాటుకు సిద్ధమైంది. కేకే–1కు సంబంధించిన మ్యాన్‌రైడింగ్‌ను కాసిపేట–2 గనికి షిఫ్ట్ చేసి రూ.3.8 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టారు. ప్రస్తుతం 800 మీటర్ల దూరం 14వ లెవల్ వరకు మ్యాన్‌రైడింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో కార్మికులకు శారీరకంగా, మానసికంగా ఉల్లాసం ఉండడంతో పాటు డిస్ట్రిబ్యూషన్‌కు గనిలోకి దిగేందుకు సమయం ఆదా అవుతుంది. ఆ సమయంలో ఉత్పత్తి సైతం మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి. 720 మంది కార్మికులు ఉన్న ఈ గనిలో 97శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోగా మ్యాన్‌రైడింగ్‌తో పాటు ఇతర సమస్యల పరిష్కారంతో అనుకున్న లక్ష్యం చేరుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దీంతో సంస్థకు, కార్మికులకు ప్రయోజనం చేకూరనుందని కేకే గ్రూపు ఏజెంట్ రాందాస్ తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని తుంగెడ ఎస్సీ కాలనీకి చెందిన దూడ కిష్టయ్య (78) శనివారం వడదెబ్బకు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం సమయంలో గ్రామంలోని కిరాణ దుకాణానికి ఎండలో నడుచుకుంటూ వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వడదెబ్బకు గురయ్యాడు. దీంతో అస్వస్థతకు గురైన కిష్టయ్య రోడ్డుపై పడిపోవటంతో గమనించిన కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకెళ్లిన కొద్ది సేపటికే మృతి చెందాడు.

భక్తిమార్గంలో యువత



సంత్ సేవాలాల్ మహరాజ్



అనార్‌పల్లి పూజల్లో పాల్గొన్న భక్తులు

సండే స్పెషల్

ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తండాలు భక్తి భావంలో పరిడవిల్లుతున్నాయి. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం ఆలయాల్లో ప్రత్యేక పూజలతో బంజార సోదరులు తరించిపోతున్నారు. సేవాలాల్ దీక్ష భూమిని భక్తులు నియమనిష్టలు పాటిస్తూ తరించిపోతున్నారు. ముఖ్యంగా యువత ఈసారి అత్యధిక మంది దీక్షను చేపట్టారు. నాడు ప్రేమ్‌సింగ్ మహరాజ్ చేపట్టిన దీక్ష నేడు ప్రతీ తండాల్లో విస్తరించింది. కొద్దిరోజులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నిర్ణయించిన భక్తులు సేవాలాల్ దీక్షను చేపట్టారు. శ్రీరామ నవమిన మహరాష్ట్రలోని పోహరాదేవిలో దీక్ష విరమించనున్నారు. దీనిపై సాక్షి ప్రత్యేక కథనం..

- తండాల్లో పెరుగుతున్న భక్తిభావం
- సేవాలాల్ నామస్మరణలో గ్రామాలు
- 756 తండాల్లో 31వేల మంది సేవాలాల్ భక్తులు
- దీక్షలపై ఆసక్తి చూపుతున్న యువత
- నానాటికీ పెరుగుతున్న భక్తి భావం
- శ్రీరామ నవమితో ముగింపు



జగదంబాదేవికి పూజలు చేస్తున్న పుజారి

కెరమెరి(ఆసిఫాబాద్): కొద్దిరోజులైన చాలు భక్తి భావంతో మెలుగుతూ.. కులగురు అయిన సేవాలాల్ మహరాజ్ లీలా గానంలో లీనమైపోవాలన్న లంబాడ(బంజార) ప్రజలు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. కఠోర దీక్ష.. కఠిన నియమాలు అవలంభిస్తున్నారు. 1979లో మహతపస్వీ, దీక్ష గురువైన ప్రేంసింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో 1600 మందితో నార్నూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ప్రారంభమైన ఈ దీక్ష 45 ఏళ్లుగా కొనసాగిస్తున్నారు. ప్రతీ సంవత్సరం భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది. మహాశివ రాత్రి నుంచి ప్రారంభమై శ్రీరామనవమి వరకు ఈ దీక్షలు కొనసాగుతాయి. మరో పది రోజుల్లో దీక్షలు ముగియనున్నాయి. 11, 21, 41 రోజులు దీక్షా కాలంగా స్వీకరించవచ్చు. ఆడ, మగ, చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఈ దీక్షలు స్వీకరించారు.

31వేల మంది సేవాలాల్ భక్తులు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ మండలాల్లోని 756 తండాల్లో సుమారు 31వేల మంది సేవాలాల్ భక్తులు ఉన్నారు. ఇందులో యువకులే అధికం. సుమారు 20వేల మంది యువకులు (18–40) ఈ ఏడాది దీక్షలు స్వీకరించినట్లు తెలుస్తోంది. ఇందులో మధ్యవయస్కులు, వృద్ధులు సుమారు 6వేలు, మహిళలు, చిన్నారులు 5వేల మంది దీక్షలు స్వీకరించారు. అయితే అధికంగా 11 రోజుల దీక్షను స్వీకరించారు. చెప్పులు లేకుండా నడవాలనేది దీక్షలో నియమం. దీక్షాపరులు కేవలం రోజుకు ఒకపూట భోజనమే చేస్తారు. పండ్లు, ఫలహారాలు తీసుకోవచ్చు.

శ్రీరామ నవమికి దీక్షా విరమణ..

మహారాష్ట్రలోని యవత్‌మాల్ జిల్లాలోని పోహరాదేవి గ్రామంలో కొలువైన జగదంబాదేవి సమక్షంలో దీక్ష విరమణ చేస్తారు. శ్రీరామనవమి రోజున జిల్లాలోని సేవాలాల్ భక్తులు అందరు పాహరాదేవికి బయలుదేరి వెళ్తారు. అక్కడే దీక్షలు విరమిస్తారు. దీక్షలు విరమించే మరో చోటు ఎక్కడా లేదు. దీక్షా స్వీకరించిన ప్రతి భక్తుడు పొరాదేవి వద్దకు వెళ్లాల్సిందే.

25ఏళ్లుగా దీక్ష స్వీకరణ



నేను 25ఏళ్లుగా సేవాలాల్ దీక్ష స్వీకరిస్తున్నాను. దీక్షా తీసుకున్నప్పటి నుంచి అంతా మంచే జరుగుతుంది. ప్రతి సంవత్సరం 41 రోజులు దీక్షలోనే ఉంటాను. కష్టాల్లో ఉన్న నేను నా కుటుంబం ప్రస్తుతం హాయిగా జీవిస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులు తొలిగిపోతున్నాయి. – సున్నాబాయి, కెరమెరి

మనస్సుకు ప్రశాంతత



27ఏళుగా సేవాలాల్ దీక్షా స్వీకరిస్తున్నాను. యువతలో భక్తి భావం ఎక్కువ కనిపిస్తుంది. దేవుడిని పూజిస్తే అంతా మంచి జరుగుతుంది. దీక్షలో చక్కటి లక్షణాలు అవడతాయి. ప్రతి ఒక్కరు దీక్ష చేపడితే కొద్ది రోజులైనా మంచి అలవాట్లు అలవడుతాయి.

–జాదవ్ వస్రాం, అనార్‌పల్లి, పుజారి

కోరికలు నెరవేరాయి



నేను ఈ సంవత్సరం ప్రథమ సారిగా దీక్ష స్వీకరించాను. గతంలో నా తండ్రి దీక్ష చేసేవారు. అప్పుడే నా మనసులోని కోరికలు నెరవేరితే దీక్ష స్వీకరిస్తానని సేవాలాల్‌ను కోరారు. నా ఆశయం నెరవేరింది. ఉద్యోగంలో చేరాను. కొద్ది రోజులైనా నియమనిష్టలతో ఉండాలని నిశ్చయించుకున్నాను.

– అజ్మీర పవన్, రెబ్బెన

'కార్మికుల వేతనాలను పెంచడంలో విఫలం'



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్

రెబ్బెన(ఆసిఫాబాద్): కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచడంతో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం గోలేటి బ్రాంచి నూతన కమిటీని ఎన్నుకోగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా అన్ని విభాగాల్లో పని చేసే కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కనీస వేతనాల జీవోలను గెజిట్ చేయటం ద్వారా కార్మికుల వేతనాలు పెరుగుతాయని అన్నారు. 2006 నుండి రాష్ట్ర ప్రభుత్వం వేతనాలను పెంచకపోవటంతో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. కార్మికుల పోరాటాల ఫలితంగా బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో కనీస వేతనాలకు సంబంధించి జీవోలు విడుదల చేసిన వాటిని గెజిట్ చేయటంలో కాలయాపన చేసిందన్నారు. రాష్ట్రంలో కొత్తగా అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఉన్న వేతనాల కంటే తగ్గించే విధంగా జీవోలను తీసుకురావటం కార్మికులను, వారి శ్రమను అవమానించటమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం 2022 జనవరిలో జీవో గడువు ముగిసిన నేటికి కొత్త జీవోను తీసుకురాకుండా కార్పొరేట్ సంస్థకు అనుకూలంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు ఓదెలు, జంగు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహిత వద్ద ప్రత్యేక బృందాలు



మురళీగూడ ప్రాణహిత వద్ద గస్తీలో అటవీశాఖ అధికారులు

పెంచికల్‌పేట్: జిల్లాను మూడు రోజుల పాటు గడగడలాడించిన ఏనుగు శుక్రవారం రాత్రి సుమారు 8గంటల ప్రాంతంలో మురళీగూడ వద్ద ప్రాణాహిత నది దాటి మహారాష్ట్రలోకి ప్రవేశించిన స్థలాన్ని తెలంగాణ, మహారాష్ట్ర అధికారులు శనివారం సంయుక్తంగా పరిశీలించారు. పెంచికల్ పేట్, బెజ్జూర్ రేంజ్ అధికారులు సుధాకర్, దయాకర్‌లు మహారాష్ట్ర బార్డర్‌కు చేరుకుని ప్రాణాహిత రేంజ్ అధికారి ఖర్తాడ్‌తో ఏనుగు కదలికలను వివరించారు. నది దాటుతున్న సమయంలో ప్రాణాహితలో చేపల వేట సాగిస్తున్న కుటుంబానికి చెందిన ఒక గుడిసెను ఏనుగు ధ్వంసం చేసింది. మూడు రోజుల పాటు ఏనుగు సంచరించిన ప్రాంతాలను, ఏనుగు దాడులను మహారాష్ట్ర అధికారులతో చర్చించారు. ఏనుగు ప్రాణాహిత తీరం దాటి చిన్న వట్ర అటవీప్రాంతంలో సుమారు 15కిలోమీటర్లు ప్రయాణం సాగించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మహారాష్ట్రలోకి వెళ్లిన ఏనుగు తిరిగి వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తు చర్యల్లో భాగంగా పెంచికల్‌పేట్ ఫారెస్టు రేంజ్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు తీరంలో గస్తీ కాస్తున్నట్లు పెంచికల్‌పేట్ రేంజ్ అధికారి సుధాకర్ తెలిపారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన సూచించారు.

సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య



రాజేష్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాలకు చెందిన సింగరేణి ఉద్యోగి చింతకింది రాజేష్(38) అనారోగ్యంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుబ్బారావ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... రాజేష్ ఆర్కే 6 మైన్‌లో పని చేస్తున్నాడు. కొంత కాలంగా తీవ్రమైన తల నొప్పితో ఆస్పత్రులకు వెళ్లినా నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రాజేష్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాలడ్డాడు. రాజేష్‌కు భార్య జ్యోతి, కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



నీలయ్య (ఫైల్)

బెజ్జూర్: మండలంలోని నాగులవాయి గ్రామానికి చెందిన చెడే నీలయ్య (42) మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో శనివారం ఉదయం గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై విక్రం తెలిపిన కథనం ప్రకారం.. మద్యం మత్తులో పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆయన పరిస్థితి నితిమించడంతో సిర్పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో మరణించాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పరామర్శ..

బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్, బీఎస్పీ, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు పరామర్శించారు. సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్షద్ హుస్సేన్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు లెండుగురి శ్యామ్ రావు తదితరులు బాధిత కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

బైక్ మాయంపై కానిస్టేబుల్ ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పోలీసు స్టేషన్ పరిధిలోనే ఓ కానిస్టేబుల్ బైక్ కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. పెద్దపల్లి జిల్లా ధర్మారం పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ ఎస్.మహేందర్ గత అక్టోబర్‌లో జన్నారం బదిలీపై వచ్చాడు. గత డిసెంబర్‌లో ఆయన ఓ పాత బైక్‌ను రూ.3వేలకు కొనుగోలు చేసి, జన్నారంలో తన క్వార్టరు వద్ద ఉంచాడు. గత ఫిబ్రవరిలో మహేందర్ సెలవుల్లో వెళ్లడం, తర్వాత ఎన్నికల చెక్‌పోస్టు డ్యూటీలకు వెళ్లాడు. ఆయన తిరిగి వచ్చాక ఆ బైక్ కనిపించలేదు. దీనిపై ఆరా తీయగా, స్టేషన్‌లోనే పని చేసే స్వీపర్ వెంకటేశ్, హోంగార్డు శ్రీనివాస్ కలసి బైక్‌ను అమ్ముకున్నారని ఆరోపిస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై సతీశ్‌కు ఇదంతా తెలుసని, ఓ వీడియో విడుదల చేశాడు. దీనిపై జన్నారం నుంచి మంచిర్యాల సీసీఎస్‌కు బదిలీపై వచ్చిన ఎస్సై సతీశ్ వివరణ కోరితే, తనకు ఆ బైక్ అమ్ముకోవడంపై ఎలాంటి సంబంధం లేదన్నారు. పాత బైక్ అమ్మాలని ఎవరికి చెప్పలేదన్నారు.

అగ్నిప్రమాదాల నివారణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

జైపూర్: అడవిలో అగ్నిప్రమాదాలు సంభవిస్తే జంతువులు, మొక్కలకు అక్కడున్న జీవజాతికి ప్రమాదం జరుగుతుందని, అగ్నిప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని డిప్యూటీ రేంజర్ సాగరిక తెలిపారు. మండలంలోని దుబ్బపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశువుల కాపర్లు, రోడ్లపైన వెళ్లే వారు సిగిరెట్, బీడీలను కాల్చి పడేయటం, వంటను చేసుకుని తర్వాత ఆ మంటను ఆర్పేకపోవడంతో చిన్నచిన్న నిప్పురవ్వ గాలిలో కలిసి వేద జల్లుతే అడవిలో అంతకాలిపోతుందన్నారు. మీకు దగ్గరలో చిన్నగా ఆడవిలో మంట కనిపిస్తే వెంటనే ఆర్పివేయాలని, ఒక్కవేళ పెద్దగా మంటలు ఉంటే వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఒక్క చిన్న నిప్పుకనికను ముట్టిన ఇప్పుడున్న ఎండకు మనుషులను తట్టుకోలేక పోతున్నామని అలాంటిది అడవి కాస్త అగ్నికి అహుతి అయితే అక్కడ ఉన్న పక్షులు, జంతువులు, చెట్లు చెమలు ఏ విధంగా ఇబ్బంది పడుతాయో వీరే ఆలోచించండీ అంటూ అవగాహన కల్పించారు. అనంతకం కూలీలకు మజ్జిగ ప్యాకెట్స్ అందించారు. ఇందులో ఎఫ్‌బీవో దీక్ష, టీఏ సృతి ఉన్నారు.

గుట్టుగా బొగ్గు దందా...

- గోదావరి ఒడ్డున కట్టెలు కాల్చి బొగ్గులు తీస్తున్న వైనం
- పట్టణాలకు బొగ్గులు రవాణా
- అటవీశాఖ అధికారుల దాడిలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి



పట్టుకున్న బొగ్గులు రవాణా చేస్తున్న ట్రాక్టర్

జైపూర్: అక్రమార్కులు వేటిని వదలటం లేదు. అక్రమ సంపాదనే ధ్యేయంగా గోదావరి ఒడ్డున గుట్టు చప్పుడు కాకుండా బొగ్గుల దందా సాగిస్తున్నారు. గోదావరి ఒడ్డున కర్రలను కాల్చి వాటి నుంచి బొగ్గులను తీసి పట్టణాలకు రవాణా చేస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఇటీవల అటవీశాఖ అధికారులు జరిపిన దాడుల్లో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కట్టెలు కాల్చి వాటి నుంచి తీసి పట్టణాలకు తరలిస్తున్న బొగ్గు ట్రాక్టర్‌ను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌లో తరలిస్తున్న బొగ్గు ట్రాక్టర్ విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుంది అంటే దందా ఎంతటి స్థాయిలో నడిపిస్తున్నారో అర్థం అవుతోంది. జైపూర్ మండలం ఇందారం, రామారావుపేట శివారు అంతా గోదావరి ఒడ్డు పొడుగునా విస్తరించివుంటుంది. గ్రామాలకు దూరంగా గోదావరి ఒడ్డున ఏవరి కంతపడకుండా గుట్టుగా అక్రమార్కులు పలు రకాల వ్యాపారాలు చేస్తున్నారు. కొంత మంది అక్రమంగా ఇసుక రవాణా సాగిస్తూ సొమ్ము చేసుకుంటుండగా మరికొంత మంది గోదావరి నదిలో కొట్టుకొచ్చిన కట్టెలు, గోదారి ఒడ్డున ఉన్న చెట్లను కొట్టి వాటిని కాల్చివాటి నుంచి బొగ్గులు తీసుకున్నారు. ఆ బొగ్గులను పట్టణాల్లో విక్రయించి డబ్బులు దండుకుంటున్నారు. పట్టణాల్లో ఈ బొగ్గు వినియోగం ఉండడంతో వీటికి ఎక్కువగా డిమాండ్ ఉందని, కొంతమంది ఇదే పనిగా దందా సాగిస్తున్నట్లుగా తెలుస్తోంది. అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహించి రామారావుపేట శివారులో బొగ్గులు తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు.

ఆర్కే 7 గనిలో సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కే 7గనిలో టీబీజీకేఎస్ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. యూనియన్ పిలుపులో భాగంగా గనిపై శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. గనిపై కార్మికులను కలిసి వారి సభ్యత్వం నమోదు చేశారు. సింగరేణిలో కార్మికుల హక్కులను సాధించి పెట్టిన చరిత్ర ఒక్క టీబీజీకేఎస్‌కు మాత్రమే ఉందన్నారు. కోలిండియాలో లేని హక్కులు, జాతీయ సంఘాలు పోగొట్టిన హక్కులను కూడా సాధించామని నేతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆ యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు తొంగల రమేశ్, నాయకులు దుర్గయ్య, రాజునాయక్, రాజేశం, గురుమూర్తి, రాజనర్సు, రత్నాకర్‌రెడ్డి, పోశంలు పాల్గొన్నారు.

వడదెబ్బతో కూలీ మృతి



శ్యాంరావు(ఫైల్)

కౌటాల: మండలంలోని గురుడుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని యాపలగూడ గ్రామానికి చెందిన గంథం శ్యాంరావు(40) వడదెబ్బతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామ శివారులో చేపడుతున్న ఉపాధి హామీ పనులకు శ్యాంరావు మూడు వారాలుగా వెళ్తున్నాడు. గత నెల 28న ఉపాధి హామీ పనులకు వెళ్లి ఇంటికి వచ్చి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు కౌటాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. అక్కడి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, తల్లి చిన్నుబాయి ఉన్నారు. శనివారం యాపలగూడలో శ్యాంరావు మృతదేహానికి బీజేపీ సిర్పూర్ నియోజకవర్గ నాయకులు పాల్వాయి సుధాకర్‌రావు నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని మాజీ జడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, ఎంపీటీసీ సభ్యులు దుర్గం మోతీరాం, పార్టీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, నాయకులు భీమన్న, తిరుపతి, మిథున్, రవి, రావుజీ, గోవింద్‌రావు, సత్తయ్య పరామర్శించారు.

నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో ఎస్సై, సిబ్బంది

సిర్పూర్(టి): మండలంలోని సిర్పూర్(టి)–కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలో రైస్ మిల్లు వద్ద ఎస్సై డికొండ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఆధార పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.నాలుగు లక్షల ఏడు వేల నగదును పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. పెద్దబండ గ్రామానికి చెందిన లొకండే లస్మయ్య సిర్పూర్(టి) నుంచి పెద్దబండ గ్రామానికి తన మోటారు సైకిల్‌పై తరలిస్తుండగా పట్టుకుని వాటిని ఫ్లెయింగ్ స్క్వాడ్ టీంకు అప్పగించినట్లు తెలిపారు.

ఐదు సాధారణ బోగీలు ఉండాలి



ఉత్తరాలను పంపిస్తున్న వారితో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్: ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలు ఉండాలని డిమాండ్ చేస్తూ ప్రధాన మంత్రికి దేశవ్యాప్త కోటి ఉత్తరాల ఉద్యమ కార్యక్రమంలో భాగంగా శనివారం మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, సామాజిక వేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఉత్తరాలను ప్రధానమంత్రికి పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత అవసరాలు, ఉద్యోగ బాధ్యతల నిర్వహణ నిమిత్తం ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి వెళ్లే వారు నిత్యం రైలు ప్రయాణం చేస్తుంటారని, కానీ రెండు మాత్రమే జనరల్ బోగీలు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైలులో కనీసం ఐదు సాధారణ బోగీలు ఉండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ అధ్యక్షుడు, సామాజిక వేత్త డాక్టర్ పరికిపండల్ల అశోక్, జన అధికార సమితి ప్రధాన కార్యదర్శి పి. కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు మహేశ్, నాయకులు మిట్టపల్లి రాజేందర్, కళ్యాణ్ పాల్గొన్నారు.

రూ.8.81 లక్షల నగదు సీజ్



పట్టుబడిన నగదుతో సీఐ శ్రీనివాస్, తదితరులు

వాంకిడి: మండలంలోని టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.8.81 లక్షల నగదు పట్టుబడినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన 13 మంది కారులో ఆసిఫాబాద్ వైపు వెళ్తుండగా వారి వద్ద రూ.8,81,300 లభించాయని, నగదుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో లింగాపూర్ ఎస్సై ప్రవీణ్, ఏఎస్సై బాల్‌సింగ్, హెడ్ కానిస్టేబుల్ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.